# అన్నివర్గాలకు అండగా బీఆర్ఎస్



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో అభ్యర్థి లింగాల కమల్‌రాజు, నాయకులు

మధిర, నవంబర్22: బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలు, అన్ని వర్గాలకు అండగా బీఆర్ఎస్ నిలుస్తుందని మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. మధిర పట్టణంలోని తన ఇంటి వద్ద టీడీపీకి చెందిన ముత్తవరపు చిన్నవెంకటేశ్వర్లు, చారి, నాగేశ్వరరావు, కృష్ణ బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమని, ఈ ప్రభుత్వంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందనే ఆశతో పెద్ద ఎత్తున పార్టీలోకి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కనుమూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, ముత్తారపు ప్యారీ తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- నియోజకవర్గంలో 'దళితబంధు' హామీకి కృతజ్ఞతలు
- విలేకరుల సమావేశంలో లింగాల కమల్‌రాజు

మధిర, నవంబర్ 22: మధిరలో జరిగిన సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభతోనే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమైందని బీఆర్ఎస్ మధిర అసెంబ్లీ అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. రాయపట్నం గ్రామంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మధిర చరిత్రలోనే కనీవినీ ఎరుగనిరీతిలో జనసందోహంతో గులాబీజెండాలతో ప్రజలు కదం తొక్కారని, నిన్నటి వరకు స్థానిక ఎమ్మెల్యే భట్టి విక్రమార్క తానే దళితబంధు పథకాన్ని తీసుకొచ్చినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ మాటలతో ఆయనకు మాట్లాడే అర్హత లేకుండా పోయిందన్నారు. నియోజకవర్గంలో తొలుత చింతకాని మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నారని, మరోసారి బోనకల్లు మండలాన్ని దళిత మహిళలు అడిగినందుకే స్పందించి బోనకల్లు మండలాన్ని ఎంపిక చేశారని వివరించారు. సీఎం ప్రజాశీర్వాదసభలో మిగిలినటు మండలాలన్నింటినీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దళితబంధు పథకాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ హామీ పట్ల ఎస్సీ సామాజిక వర్గం దళిత కుటుంబాల తరపున సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ అమలు కానీ పథకాలతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని, ఓటు అనే ఆయుధంతో కాంగ్రెస్ నాయకులకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ గుర్రం రామారావు, మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, కటికల సత్యనారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజు, పక్కన కొండబాల

# బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం





చింతకాని : రామకృష్ణాపురంలో మ్యానిఫెస్టోలో అంశాలు వివరిస్తున్న కమల్‌రాజు కూతురు అభిజ్ఞ, నాయకులు, తన తండ్రికి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న అభిజ్ఞ

ఎర్రుపాలెం, నవంబర్22: మండలంలోని గ్రామాల్లో మధిర ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు గెలుపు కోరుతూ ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుపై ఓట్లు వేసి అభ్యర్థి లింగాల కమల్‌రాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు దేవరకొండ శిరీష, శీలం కవిత, మొగిలి అప్పారావు, షేక్ మస్తాన్‌వలీ, మూల్పూరి శ్రీనివాసరావు, చిన్నంరాము, గుర్రాల పుల్లారెడ్డి, శ్రీపాల శెట్టి తిరుపతిరావు, షేక్ హుస్సేన్, బాబుసాహెబ్, షేక్ బాజీ, వెంకయ్య, రవి, భాస్కర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### తండ్రి గెలుపు కోసం తనయ ప్రచారం

చింతకాని, నవంబర్ 22 : మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్‌కు ఓట్లు వేయాలంటూ ఆయన కూతురు అభిజ్ఞ బుధవారం ఓటర్లను అభ్యర్థించారు. రామకృష్ణాపురంతో పాటు పలు గ్రామాల్లో తన తండ్రి గెలుపు కోసం ఆమె బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోలోని అంశాలను పల్లెల్లోని ఓటర్లకు వివరిస్తూ ఓట్లు వేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల నాయకులు కురుగుంట్ల రవీందర్‌రెడ్డి, కన్నెబోయిన కుటుంబరావు, శెట్టి సురేశ్, పిన్నెల్లి శ్రీనివాస్, గాంధీరెడ్డి, నిర్మల, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎర్రుపాలెం : ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

చింతకాని, నవంబర్ 22 : మధిర నియోజకవర్గంలో అనునిత్యం ప్రజలకు, నాయకులకు, అందుబాటులో ఉండే ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజును గెలిపించాలని బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు బొగ్గారపు రాంబాబు అన్నారు. కొదుమూరు గ్రామంలో లింగాల కమల్‌రాజు గెలుపును కాంక్షిస్తూ బుధవారం ఆయన బూత్‌కమిటీ, గ్రామకమిటీతో కలిసి విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను ఇంటింటికి వెళ్లి ఓటర్లకు వివరిస్తున్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల, గ్రామ శాఖ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ, నవంబర్ 22 : గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు గెలుపును కాంక్షిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ మ్యానిఫెస్టోను అందించి ప్రస్తుతం అందుతున్న పథకాల గురించి వివరించారు. ఆయా గ్రామాల నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌లు కలిసి ఇంటింటికి వెళ్లికారు గుర్తుపై ఓటేసి కమల్‌రాజును గెలిపించాలని కోరారు. ప్రభుత్వం వచ్చాక అందే కొత్త పథకాలు వాటి వల్ల వివిధ వర్గాలకు చేకూరే ప్రయోజనాల గురించి చెపుతున్నారు. సువర్ణాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోట ధర్మారావు, అమరబోయిన వీరబాబు, కొట్టె ఉపేందర్, అపర్ణ, మోహన్, పసుపులేటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.





చింతకాని : కొదుమూరులో ఇంటించి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, ముదిగొండ : లింగాల కమల్‌రాజుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న నాయకులు

## నేడు మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు ప్రచారం

బోనకల్లు, నవంబర్22: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లింగాల కమల్‌రాజు ప్రచార కార్యక్రమం గురువారం మండలంలో జరుగుతుందని మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రాపల్లె, 4 గంటలకు చిరునోముల, 5 గంటలకు చొప్పకట్లపాలెం, 6 గంటలకు ముష్టికుంట్ల గ్రామాల్లో ప్రచార కార్యక్రమానికి బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలుపాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## తనిఖీల్లో రూ.3.74 లక్షల నగదు సీజ్

ఎర్రుపాలెం, నవంబర్22: ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3,74,562 నగదును సీజ్ చేసినట్లు ఎర్రుపాలెం ఎస్సై సురేశ్ తెలిపారు. బుధవారం ఎర్రుపాలెం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఎటువంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట గ్రామానికి చెందిన చిన్నబత్తిని జయకుమార్ వద్ద నుంచి రూ.1,80,000, ఎర్రుపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన సానె రామకిశోర్ వద్ద నుంచి రూ.1,25,000లు, విజయవాడకు చెందిన ప్రవీణ్‌కుమార్ వద్ద నుంచి రూ.69,562 నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

## ముగిసిన హోమ్ ఓటింగ్



'ఇంటివద్దే ఓటు'కు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ముదిగొండ, నవంబర్ 22 : వృద్ధులు, దివ్యాంగులకు కోసం ఏర్పాటు చేసిన హోమ్ ఓటింగ్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో ఎన్నికల సిబ్బంది వీరిని పరీక్షించి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించారు. మండల పరిధిలో 121 మందిని గుర్తించగా మంగళ, బుధ వారాల్లో ఓటు వేసేందుకు ఏర్పాటు చేశారు. వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఎన్నికల అధికారులు బ్యాలెట్ ను ఇవ్వగా అవగాహన లేని వారు కుటుంబ సభ్యుల సహాయం తీసుకునే వెసులుబాటు కల్పించారు. రహస్యంగా ఓటు వేసి కవర్‌లో పెట్టి ఇవ్వగా అందరి ముందే ప్రత్యేక సీల్ వేసిన డ్రాప్ బాక్స్‌లో భద్రపర్చారు. వీటిని మధిరలోని ఆర్వో కార్యాలయానికి తరలించనున్నారు.